సాగులో సందేహాలా?

- నేడు జిల్లా వ్యవసాయ అధికారితో 'సాక్షి' ఫోన్ఇన్

జగిత్యాలఅగ్రికల్చర్: వర్షాలు ముందుగానే కురుస్తున్న నేపథ్యంలో పంటల సాగుకు సంసిద్ధం కావచ్చా.. ఏ పంటలు వేసుకుంటే బాగుంటుంది. వరినారు పోసేందుకు అనుకూలమైన సమయమా.. విత్తనాల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి.. నకిలీ విత్తనాలను ఎలా గుర్తుపట్టాలన్నదానిపై జిల్లా వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. రైతులు నేరుగా వ్యవసాయాధికారికి ఫోన్చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

సాక్షి ఫోన్ ఇన్

తేదీ : 04.06.2025 బుధవారం

సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు



భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

డయల్ చేయాల్సిన నంబర్ : 89777 45435

న్యూస్‌రీల్

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో మధుసూదన్

జగిత్యాలరూరల్: రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ అన్నారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 104 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ సమస్యలతో బాధపడుతున్న రైతులు రెవెన్యూ సదస్సుల్లో తమ దరఖాస్తులు ఇస్తే క్షేత్రస్థాయిలోనే వాటిని పరిశీలించి వారి వివరాలను భూభారతిలో పొందుపర్చడం జరుగుతుందన్నారు. జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐలు భూమయ్య, శంషోద్దీన్ పాల్గొన్నారు.

కుజదోష నివారణ పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మంగళవారం కుజదోష నివారణ పూజలు ఘనంగా నిర్వహించారు. కుటుంబ కలహాలు, వాస్తుదోషాలు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారు కుజదోష నివారణకు పూజలు చేశారు. అనంతరం స్వామివారలకు మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు

జగిత్యాలటౌన్: ఆదర్శ మారుతీ సుజుకి నెక్సా జగిత్యాలలో రెసిడెంట్ రిలేషన్‌షిప్ మేనేజర్, సీనియర్ రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాలకు ఈనెల 6న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బింగి సత్యమ్మ మంగళవారం తెలిపారు. ఈ ఉద్యోగాలకు డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని, ఇంగ్లిష్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు జగిత్యాల, మెట్‌పల్లిలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగ యువతీయువకులు 6న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని రెండో అంతస్తులో రూం నంబర్ 218లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 63095 23434 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అటవీ భూమి స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న భూమి, తొలగించిన షెడ్డు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామ శివారుల్లోని అటవీప్రాంతంలో కొంత మంది అటవీశాఖకు చెందిన భూమిని ఆక్రమించి, సాగుచేస్తుండగా అటవీశాఖ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు అటవీభూమిని చదును చేసి అందులో మామిడి చెట్లను నాటుతుండగా సమాచారం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకుని మామిడి చెట్లను తొలగించి చదును చేసిన భూమిని స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి అటవీభూమిలో షెడ్డు నిర్మించగా అధికారులు సిబ్బందితో కలిసి ధ్వంసం చేసి తొలగించారు. ఈ విషయంపై అటవీశాఖ ధర్మపురి రేంజర్ శ్రీనాథ్ మాట్లాడుతూ, ఇటీవల రంగసాగర్ గ్రామానికి చెందిన సాగర్ అటవీభూములను సాగుచేస్తే కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, అటవీభూములను సాగుచేసినా, చదును చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, చదును చేయడానికి వినియోగించే యంత్రాలను సీజ్ చేస్తామని తెలిపారు.

చిట్టీల రాయుళ్లు!

శాతవాహన వర్సిటీలో భారీగా చూచిరాతలు

- డిగ్రీలో డిబార్ అవుతున్న వారిలో కరోనా టైంలో 'పది' పాసైన వారే ఎక్కువ
- మొదటి నుంచి ఆరో సెమిస్టర్ వరకు ఇదే తీరు
- పర్యవేక్షణ పెరగడంతో భారీగా పట్టుబడుతున్న విద్యార్థులు
- సోషల్ మీడియా వ్యసనం, చదవలేక పోవడంతో అడ్డదారులు
- డిబార్ అయిన విద్యార్థికి మద్దతుగా ఉత్తరాది మంత్రి ఫోన్!



సాక్షి పరిశీలన

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

కుదురుగా పది నిమిషాలు కూర్చుని పరీక్ష రాయలేరు. పరీక్ష మొదలవగానే.. జేబులో దాచిన మైక్రో జిరాక్స్‌లు తీయడం, కాపీ చేయడం.. ఇదీ.. శాతవాహన వర్సిటీలో డిగ్రీ విద్యార్థుల తీరు. వాస్తవానికి మునుపెన్నడూ లేని స్థాయిలో విద్యార్థులు చిట్టీలు కొడుతూ పట్టుబడి డిబార్ అవుతున్నారు. గతవారంలో ఒకేరోజు 35 మంది డిబార్ అవడం వర్సిటీ చరిత్రలోనే మొదటిసారి కావడం గమనార్హం. వాస్తవానికి విద్యార్థులు ఇలా చిట్టీలు రాయడం ఆందోళన కలిగిస్తోంది. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్న ఆశయంతో యూనివర్సిటీ అధికారులు ఈసారి సిబ్బందిని పెంచి ఆకస్మిక తనిఖీలు చేయిస్తుండటంతో భారీగా చిట్టీల రాయుళ్లు పట్టుబడుతున్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా విద్యార్థులు డిబార్ కావడంపై వర్సిటీ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతోంది. జూన్ 2 వరకు వర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు రాస్తున్న 171 మంది డిబార్ అయ్యారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కరోనా సమయంలోని వారేనా?

ఈ విషయంపై ఆరా తీసినప్పుడు పలు ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. వాస్తవానికి ఇప్పుడు డిబార్ అవుతున్న విద్యార్థులంతా కరోనా విపత్తు సమయంలో 10వ తరగతి పాస్ అయినవారే కావడం ఆందోళన కలిగిస్తోంది. 2020 మార్చిలో ఆకస్మికంగా కరోనా విపత్తు ప్రపంచాన్ని కుదిపేసింది. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడంతో జనజీవనం స్తంభించింది. ఈ క్రమంలో ప్రభుత్వం ఎలాంటి పరీక్షలు నిర్వహించలేకపోయింది. ఫలితంగా ఎలాంటి పరీక్షలు లేకుండా విద్యార్థులందరినీ పాస్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత 2021లోనూ పరీక్షలు లేకుండా పది పాసయ్యారు. 2022లో మాత్రం పది పరీక్షలు నిర్వహించినా.. గతంలో ఉన్న 11 పేపర్లను ఆరుకు కుదించి తేలిగ్గా ప్రశ్నలు ఇచ్చారు. 2023లో పది పరీక్షరాసిన పిల్లలు కాస్త నయంగానీ, 2020, 2021లో అసలు పరీక్షలు లేకుండా పాసైన విద్యార్థుల ప్రతిభాపాటవాలపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి.

సోషల్ మీడియా మరో కారణం

2020, 2021లో పది పాసైన వారి ప్రతిభాపాటవాలపై ఇప్పుడు ప్రొఫెసర్లు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. డిబార్ అవుతున్న వారిలో అధికంగా వారే ఉండటం, వారంతా సోషల్ మీడియా ప్రభావంతో కాపీయింగ్ పాల్పడుతున్నారని అభిప్రాయపడుతున్నారు. సులువుగా పరీక్షలు పాసవడానికి అలవాటు పడినవారు, ఆ కోణంలో వెళ్తున్నారని అంటున్నారు. కాపీ కొడితే పట్టుబడ్డారంటూ సోషల్‌మీడియా రీల్స్ చూసి వీరు కూడా పాటించి దొరికిపోతున్నారని పేరు తెలిపేందుకు ఇష్టపడని ఓ ప్రొఫెసర్ తెలిపారు. మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. డిబార్ అయిన విద్యార్థులంతా రాజకీయ నాయకులతో వారిని వదిలేయాలంటూ వర్సిటీ అధికారులపై ఒత్తిడి చేయిస్తున్నారు. వారిలో ఓ విద్యార్థిని వదిలేయాలంటూ ఉత్తరాదికి చెందిన ఓ పెద్ద మంత్రి ఏకంగా వర్సిటీకి ఫోన్ చేయడంతో విస్తుపోవడం అధికారుల వంతైంది.

వారిలోనే డిబార్ సంఖ్య ఎక్కువ

2020లో పది పాసైనవారు ఇప్పుడు 6వ సెమిస్టర్, 2021లో పది పాసైనవారు 4వ సెమిస్టర్, 2022లో పది పాసైన వారు 2వ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్నారు. ప్రతీ విద్యాసంవత్సరంలోనూ 1,3,5వ సెమిస్టర్లకు ఒకసారి, 2,4,6వ సెమిస్టర్లకు మరోసారి పరీక్షలు నిర్వహిస్తారు. 2023–24లో 1,3,5వ సెమిస్టర్లలో 26 మంది డిబార్ అయ్యారు. అదే 2023–24 విద్యా సంవత్సరంలో 2,4,6 సెమిస్టర్లలో 60 మంది డిబార్‌కు గురయ్యారు. 2024–25లో 1,3,5వ సెమిస్టర్లలో కేవలం 31 మంది డిబార్ కాగా, 2024–25 విద్యా సంవత్సరంలో 2,4,6 సెమిస్టర్లలో ఏకంగా 140 మంది డిబార్ అయ్యారంటే.. పరిస్థితి ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అందులో మే 28న ఒకేరోజు 34 మంది డిబార్‌కావడం గమనార్హం. అందులోనూ కరీంనగర్ నడిబొడ్డున తెలంగాణచౌక్‌ను ఆనుకుని ఉన్న కాలేజీ నుంచి ఏకంగా 13 మంది విద్యార్థులు ఉండటం విశేషం. ఇప్పుడు డిబార్ అయిన విద్యార్థుల్లో అధికంగా 2020, 2021లో పదో తరగతి పాసైన వారే అధికంగా ఉండటం గమనించదగ్గ అంశం. శాతవాహన యూనివర్సిటీ కింద సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, హన్మకొండ జిల్లాల పరిధిలో మొత్తం 120 డిగ్రీ కాలేజీలు, 28 పీజీ, 23 బీఈడీ, 7 ఎంబీఏ, ఒక ఎంఈడీ, ఒక బీపీఈడీ, ఒక లా కాలేజీలు తదితరాలు ఉన్నాయి. ఇటీవల వర్సిటీకి అదనంగా లా, ఇంజినీరింగ్ కాలేజీలు కూడా మంజూరయ్యాయి. ఇంతటి ప్రతిష్టాత్మక వర్సిటీలో ఇలాంటి విపరీత ధోరణి ఇదే తొలిసారి అని పలువురు వాపోతున్నారు.

పట్టణానికి నలువైపులా మార్కెట్లు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: ప్రజల సౌకర్యార్థం పట్టణానికి నలువైపులా మార్కెట్లు ఏర్పాటు చేశామని, పట్టణాభివృద్ధికి పాటుపడతానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 2,18,17వ వార్డుల్లో రూ.20 లక్షలతో చేపట్టే బీటీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా గెలిపించినందుకు పట్టణాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనన్ని నిధులు జగిత్యాలకు మంజూరు చేయించడం జరిగిందన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని 13వ వార్డుకు చెందిన బోగ రాజేశ్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా రూ.2.50 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమాల్లో కమిషనర్ స్పందన, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జ్యోతి, మాజీ కౌన్సిలర్లు లత, నవీన్, గిరి నాగభూషణం, చెట్‌పల్లి సుధాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల బల్దియాలో పెరగనున్న వార్డులు

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీలో వార్డులు పెరగనున్నాయి. ఈ మేరకు డెలిమిటేషన్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. గతంలో నూకపల్లి, మోతె, లింగంపేట, హస్నాబాద్‌తో పాటు, కొన్ని గ్రామాలు విలీనం కాగా, కొన్ని గ్రామాల సర్వే నంబర్లు విలీనమయ్యాయి. ఈ మేరకు జగిత్యాలలో 48 వార్డులు ఉండగా, డెలిమిటేషన్ కార్యక్రమం చేపడుతున్నారు. అయితే మరిన్ని వార్డులు పెరిగే అవకాశం ఉండగా, వార్డు ఆఫీసర్లు వీటిపై సర్వే చేస్తున్నారు.

నక్షపై శిక్షణ

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని భవనాలకు నక్ష ఏర్పాటు చేయడం కోసం పైలట్ ప్రాజెక్ట్ కింద జగిత్యాల ఎంపికైంది. ఈ నేపథ్యంలో ల్యాండ్స్ అండ్ సర్వే అధికారులకు మైసూర్‌లో శిక్షణ ఇస్తున్నారు. వారంరోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఇటీవలే జగిత్యాలలో హెలికాప్టర్, డ్రోన్ కెమెరా ద్వారా భవనాలను చిత్రీకరించారు. ఈ నేపథ్యంలో భవనాలు ఏ మేరకు ఉన్నాయి, వాటి మ్యాప్‌లతో పాటు నక్షతో కూడిన పటాలను గీయనున్నారు.

పైసలున్నా.. పనుల్లో జాప్యం

'పట్టణంలో ఆరు చోట్ల హెల్త్ సబ్ సెంటర్లకు సొంత భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం రెండేళ్ల క్రితం నిధులు మంజూరు చేసింది. కానీ, ఇందులో ఇప్పటి వరకు ఒక్క చోట కూడా భవన నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. స్థానికంగా వాటికి అనువైన ప్రభుత్వ స్థలాలు లేకపోవడం వల్ల నిర్మాణ పనులు మొదలు పెట్టడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ సమస్య ఒక్క మెట్‌పల్లిలోనే కాదు.. జిల్లాలో చాలా చోట్ల ఉండడం సంబంధిత అధికారులకు తలనొప్పిగా మారింది.'

- హెల్త్ సబ్‌సెంటర్లకు గ్రహణం
- రెండేళ్ల క్రితం జిల్లాకు 95 మంజూరు
- ఇప్పటి వరకు కేవలం 11 భవనాలు మాత్రమే పూర్తి
- స్థల సమస్యతో చాలా చోట్ల ప్రారంభం కాని పనులు



కాంట్రాక్టర్లలో అర్ధంతరంగా నిలిచిపోయిన సబ్ సెంటర్ పనులు

సాక్షి ఫోటో

జిల్లాకు మంజూరైన భవనాలు	95
ఇప్పటి వరకు పూర్తయినవి	11
వివిధ దశల్లో ఉన్నవి	23
పనులు ప్రారంభం కానివి	61

మెట్‌పల్లి(కోరుట్ల): ప్రజలకు వైద్యం అందించే చోట మెరుగైన వసతులు కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం హెల్త్ సబ్ సెంటర్లకు సొంత భవనాలు నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం రెండేళ్ల క్రితం నిధులు సైతం మంజూరు చేసింది. అయితే, జిల్లాలో ఇప్పటి వరకు కొన్ని చోట్ల మాత్రమే భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. చాలా చోట్ల స్థలాల సమస్యతో పాటు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడం వంటి కారణాల వల్ల పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు.

95 భవనాలు.. రూ.19 కోట్లు..

- జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో కలుపుకొని మొత్తం 95 చోట్ల ఉన్న హెల్త్ సబ్‌సెంటర్లకు కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్' పేరుతో సొంత భవనాలు మంజూరు చేసింది.
- ఒక్కో సెంటర్ నిర్మాణానికి నేషనల్ హెల్త్ మిషన్, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.19 కోట్లు కేటాయించింది. పనుల పర్యవేక్షణ బాధ్యతను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించింది.
- అయితే ఇందులో ఇప్పటి వరకు కేవలం 11చోట్ల మాత్రమే భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి.
- 23 చోట్ల వివిధ దశల్లో పనులు సాగుతుండగా, మిగతా 61 చోట్ల ఇంత వరకు అసలు పనులే ప్రారంభించకపోవడం గమనార్హం.

జాప్యానికి కారణాలు..

- నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడానికి కొన్ని చోట్ల స్థలాల సమస్య ఉంటే.. మరికొన్ని చోట్ల ముడి సరుకుల ధరలు పెరగడం వల్ల ప్రభుత్వం ఇచ్చే నిధులతో గిట్టుబాటు కాదనే ఉద్దేశంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిసింది.
- మెట్‌పల్లి పట్టణానికి ఆరు మంజూరు కాగా, ఇప్పటి వరకు స్థలాల ఎంపిక జరగలేదు. ఇక్కడ ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడం పెద్ద సమస్యగా మారింది.
- స్థానిక వ్యవసాయ మార్కెట్, మండల పరిషత్‌లో రెండు నిర్మించడానికి ఆయా శాఖలు మొదట అంగీకరించాయి. కానీ, భవిష్యత్తులో తలెత్తే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆ తర్వాత స్థలాలు ఇవ్వొద్దని నిర్ణయం తీసుకున్నాయి.
- అలాగే మినీ స్టేడియం స్థలంలో ఒకటి నిర్మించాలని తలపెట్టగా, అక్కడ కూడా ఆటంకాలు ఎదురుకావడంతో విరమించుకున్నారు.

కాంట్రాక్టర్లకు నోటీసులు

- స్థలాలు ఉన్న చోట పనులు మొదలు పెట్టని కాంట్రాక్టర్లకు అధికారులు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. వెంటనే పనులు ప్రారంభించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించినట్లు సమాచారం. జిల్లాలో మొత్తం భవనాలకు సంబంధించిన పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ, చాలా చోట్ల అధికారులు తగిన చొరవ తీసుకోకపోవడం వల్లే పనులు పెండింగ్‌లో ఉంటున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు

కొన్ని ప్రాంతాల్లో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. అలాంటి వారికి వెంటనే మొదలుపెట్టాలని నోటీసులు ఇవ్వడం జరిగింది. మరికొన్ని చోట్ల స్థలాల సమస్య ఉంది. దీనిని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ సమస్య పరిష్కారం కాగానే పనులు ప్రారంభిస్తాం.

– లక్ష్మణ్‌రావు, పంచాయతీరాజ్ ఈఈ

అంబేడ్కర్ రాజ్యాంగంతోనే తెలంగాణ సాకారం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విప్ అడ్లూరి, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తదితరులు

గొల్లపల్లి(ధర్మపురి): తెలంగాణ ఏర్పాటు కలను సాధ్యం చేసింది అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమేనని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ ముందుచూపుతో రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందని వివరించారు. దేశంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం, సమాన అవకాశాలు చేకూర్చేలా రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగిందన్నారు. అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని, భారత రాజ్యాంగ శిల్పిగా, ప్రజాస్వామ్య పరిరక్షకునిగా, మహామేధావి అయిన ఆ మహనీయునికి భారతరత్న ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంటల విస్తీర్ణాన్ని బట్టి ఎరువులు అందజేయాలి



రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

- కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి(కోరుట్ల): పంటల విస్తీర్ణాన్ని బట్టి రైతులకు ఎరువులు అందజేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. పట్టణంలోని విశాల సహకార సంఘ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాలకవర్గం, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ రైతు ఆధార్ కార్డు, పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకోవడంతో పాటు వారి వేసే పంట విస్తీర్ణాన్ని బట్టి మాత్రమే ఎరువులు అందజేయాలన్నారు. అలాగే పీవో మిషన్ ఆధారంగా విక్రయాలు జరపాలన్నారు. కలెక్టర్ వెంట సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ నిజాం ఉన్నారు.

భూసమస్యల పరిష్కారానికే భూభారతి..

మెట్‌పల్లిరూరల్/ఇబ్రహీంపట్నం: భూసమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతి గ్రామ సభలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం మెట్‌పల్లి మండలం పెద్దాపూర్, ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్‌కొండాపూర్, ఎర్రాపూర్ గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించగా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. దరఖాస్తులను క్షుణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఫకీర్‌కొండాపూర్ సదస్సులో 65 మంది, ఎర్రాపూర్‌లో 19 మంది రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమాల్లో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు శ్రీనివాస్, వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్‌ఐలు కాంతయ్య, రమేశ్, రేవంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బడిబాట విజయవంతం చేయాలి



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

జగిత్యాల: జిల్లాలో ఈనెల 6 నుంచి 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఎస్సెస్సీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంగళవారం పొన్నాల గార్డెన్స్‌లో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ బాధ్యత ఉపాధ్యాయులదేనని, ఈ సంవత్సరం బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల సంఖ్య పెంచేలా చూడాలన్నారు. త్వరలోనే జిల్లా కేంద్రంలో డైట్ కాలేజీతో పాటు విద్యాధికారి పోస్టులు మంజూరవుతాయని పేర్కొన్నారు. పీఆర్టీయూ నాయకులు గుండు లక్ష్మణ్, దామోదర్‌రెడ్డి, రాము, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బయాలజీ, ఫిజిక్స్ మార్కులు వేర్వేరుగా ఉండేలా చూడాలి

8,9,10వ తరగతుల బయాలజీ, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లకు 100 మార్కులు వేర్వేరుగా ఉండేలా చూడాలని, 6,7వ తరగతుల్లో జీవశాస్త్రం, భౌతికశాస్త్రం అంశాలకు వేర్వేరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి బయాలజికల్ సైన్స్ ఫోరం నాయకులు వినతిపత్రం అందజేశారు. రెండు వేరుగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో బయాలజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో లాభాలు



రైతులకు విత్తనాలు అందిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త పద్మజ, నాయకులు

కోరుట్ల రూరల్/మల్లాపూర్/మేడిపల్లి/ఇబ్రహీంపట్నం/కథలాపూర్: నాణ్యమైన విత్తనంతో వ్యవసాయంలో అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు అన్నారు. కోరుట్ల మండలం అయిలాపూర్ రైతువేదికలో ప్రాంతీయ పరిశోధనా స్థానం పొలాస శాస్త్రవేత్త పద్మజ, మల్లాపూర్ మండల కేంద్రంలోని రైతువేదిక లో పొలాస ప్రాంతీయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త సౌజన్య, మేడిపల్లి వ్యవసాయ శాస్త్రవేత్త రవి, కథలాపూర్‌లో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త పద్మజ రైతులకు మంగళవారం 'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఇబ్రహీంపట్నంలో రైతులకు విత్తనాల మినీ కిట్లను ఏవో రాజ్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల ఏవోలు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసులంటే గౌరవం ఉండాలి



వీడియో చూపుతున్న సంపత్

హుజూరాబాద్: ప్రజలకు పోలీసులంటే గౌరవం ఉండాలే తప్ప భయం కాదని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ఇన్‌చార్జి తిప్పారపు సంపత్ అన్నారు. ఇటీవల ఎస్సై భార్గవ్ దళిత యువకుడు మహేందర్‌ను తీవ్రంగా కొట్టిన వీడియోలను మీడియాకు రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సై భార్గవ్ ప్రవర్తన ఒక నియంతలా ఉందన్నారు. దళితుడిని అసభ్య పదజాలంతో దూషిస్తూ కొట్టడం ఏంటన్నారు. ఈ ఘటనపై పలుసార్లు ఫిర్యాదు చేసినా, ఇప్పటివరకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరించని కానిస్టేబుళ్లు ఆకాష్ రెడ్డి, రవి కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యవంతమైన సమాజం



సైక్లింగ్‌తో కలిగే ప్రయోజనాలు వివరిస్తున్న కిషన్

మల్లాపూర్(కోరుట్ల): రోజూ సైక్లింగ్ చేయడంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సైక్లింగ్ క్లబ్ ఫౌండర్ వాల్గొట్ కిషన్ అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ నుంచి సైక్లింగ్‌తో మల్లాపూర్ మండలం మొగిలిపేటకు చేరుకుని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సైక్లింగ్‌తో షుగర్, రక్తపోటు, ఊబకాయాన్ని నివారించవచ్చన్నారు. 'సైకిల్ తొక్కండి.. ఆరోగ్యంగా ఉండండి' అనే నినాదంతో ప్రజలందరూ నిత్యం సైక్లింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గోల్కొండ రమేశ్, ఏలేటి ప్రీతంరెడ్డి, గంధం రఘు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన సిలిండర్లు

హుజూరాబాద్: హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులో కరీంనగర్ – వరంగల్ రహదారిపై మంగళవారం ఆయిల్ ట్యాంకర్ ట్రాలీ ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటో ట్రాలీ బోల్తాపడడంతో రోడ్డుపై సిలిండర్లు చెల్లాచెదురగా పడిపోయాయి. కాగా కొన్ని సిలిండర్ల నుంచి గ్యాస్ లీకైంది. అయినా అవి పేలకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. కాగా ట్యాంకర్ డ్రైవర్ పారిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్‌పాం సాగు పెంచేందుకు సదస్సులు.. ప్రోత్సాహకాలు



ఆయిల్‌పాం తోట



ఇటీవల ఆయిల్‌పాం మొబైల్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

- ప్రత్యేక దృష్టిసారించిన అధికార యంత్రాంగం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఆయిల్‌పాం సాగుకు అనువైన నేలలు ఉండటంతో ప్రభుత్వం జగిత్యాలపై ప్రత్యేక దృష్టి సారించింది. దీనికి తోడు మండు వేసవిలో సైతం ఎస్సారెస్పీ, చెరువులు, కుంటలు, వ్యవసాయ బావుల ద్వారా సాగు నీరు అందే అవకాశం ఉండడంతో ఆయిల్‌పాం వైపు రైతుల దృష్టి మళ్లించాలని జిల్లా అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేస్తుంది. దీంతో, ఉద్యాన, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా సమావేశాలు నిర్వహిస్తున్నాయి. క్షేత్రస్థాయికి వెళ్లి రైతులను చైతన్యం చేసేందుకు ఇటీవల మొబైల్ వ్యాన్‌లను సైతం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,431 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేయగా, ఈ ఏడాది 3,750 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఆయిల్‌పాం వైపు మళ్లేలా..

జిల్లాలో ప్రతీ సీజన్‌లో 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. వరి నాట్ల సమయంలో కూలీలతో ఇబ్బందులు, పంట కొనుగోలు, మిల్లులకు తరలించడం, రైస్‌మిల్లర్ల తిరకాసులు, రవాణా సమస్యలు, బియ్యం విషయంలో ఎఫ్‌సీఐ కఠిన నిబంధనలతో రానున్న రోజుల్లో వరిని తగ్గించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. వరిని నాలుగైదు ఎకరాల్లో సాగు చేసే రైతుల్లో కనీసం ఒక ఎకరం ఆయిల్‌పాం సాగు చేయించాలని జిల్లా యంత్రాంగం ధృడ సంకల్పంతో ఉంది. ఈ మేరకు ఆయిల్‌పాం సమావేశాల్లో కలెక్టర్ సత్యప్రసాద్ స్వయంగా పాల్గొంటూ వరి వల్ల కలిగే ఇబ్బందులు, ఆయిల్‌పాం సాగుతో లాభాల గురించి వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

సాగు విస్తీర్ణంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఆయిల్‌పాం ఉత్పత్తులు సేకరించేందుకు లోహియా కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు పంట సాగును అత్యధిక విస్తీర్ణంలో చేపట్టేందుకు జిల్లా యంత్రాంగంతో కలిసి లోహియా కంపెనీ విస్తృత ప్రచారం చేస్తోంది. సాగు చేస్తామని ఉద్యానశాఖకు దరఖాస్తు చేసుకున్న రైతులకు జిల్లాలోని గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌లో ఏర్పాటు చేసిన నర్సరీ ద్వారాదా ఆయిల్‌పాం మొక్కలు సరఫరా చేస్తున్నారు. తాజాగా బుగ్గారం మండలం యశ్వంత్‌రావుపేటలో ఆయిల్‌పాం రిఫైనరీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు 22 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన లోహియా కంపెనీ, సెప్టెంబర్ 4న శంకుస్థాపన చేసేందుకు కూడా సంసిద్ధమైంది.

ప్రభుత్వ సబ్సిడీలు..

ఇప్పటికే ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు రూ.213 ఉండే మొక్కకు రూ.193 సబ్సిడీ ఇచ్చి, రైతుకు కేవలం రూ.20 కే అందిస్తున్నారు. పరిమితులు లేకుండా 12.50 ఎకరాల వరకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇస్తున్నారు. మొక్కలు నాటిన తర్వాత అంతర పంటల సాగుకు ఎకరాకు రూ.4,200 చొప్పున నాలుగేళ్ల పాటు ఇస్తారు. అయితే, ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తుండటంతో రైతులు ఇప్పుడిప్పుడే సాగు వైపు ఆలోచనలు చేస్తున్నారు. ఆయిల్‌పాం గెల వచ్చేవరకు ఏ రేటు ఉంటుందో, ఎన్ని టన్నుల దిగుబడి వస్తుందో, కంపెనీ వారు కొనకపోతే ఎలా.. ఇలా రకరకాల సందేహాలు వెలిబుచ్చుతూ, కొందరు రైతులు ఈపంట సాగుకు దూరంగా ఉంటున్నారు.

కంపెనీ ప్రోత్సాహకాలు

కంపెనీ ప్రారంభించే ఆయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీ నడవాలంటే కనీసం రోజుకు 160–200 మెట్రిక్ టన్నుల ఆయిల్‌పాం గెలలు అవసరం. ఫ్యాక్టరీ రోజూ 8 గంటల పాటు నడిపిస్తే గంటకు 20 మె.ట గెలలు కావాలి. దీంతో ఫ్యాక్టరీ జిల్లాలోనే ఏర్పాటు చేస్తున్నందున ఆయిల్‌పాం సాగును విపరీతంగా పెంచాలని అధికారులు, కంపెనీ ప్రతినిధులు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వంతోపాటు కంపెనీ సైతం రైతులను ప్రోత్సహించే పనిలో పడింది. తాజాగా ఆగస్టు 31 వరకు ఆయిల్‌పాం మొక్కలు నాటిన రైతులకు బంపర్ లక్కీ డ్రా నిర్వహించేందుకు కంపెనీ సిద్ధమైంది. మొదటి బహుమతి ఒక్కరికి రూ.2 లక్షల విలువ గల బుల్లెట్ బండి, రెండో బహుమతి ఒక స్కూటీ, మూడో బహుమతి ఫ్రిడ్జ్, నాల్గో బహుమతిగా పది మందికి ఎయిర్ కూలర్, ఐదో బహుమతి 25 మందికి డిజిటల్ వాచీ, ఆరో బహుమతి 50 మందికి కుక్కర్‌ను ఫ్యాక్టరీ శంకుస్థాపన కార్యక్రమంలో ఇస్తామని కంపెనీ ప్రకటించింది.

25 ఎకరాల్లో సాగు చేశా



గతంలో వరి సాగు చేశా. ఆదాయం అంతంతే వచ్చేది. ఆయిల్‌పాం సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటంతో 25 ఎకరాల్లో సాగు చేస్తున్న. మొక్కలు నాటి రెండేళ్లవుతుంది. మరో ఏడాదిలో గెలలు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న ధరలు రైతులకు ఆశాజనకంగా ఉన్నాయి.

– రాజశేఖర్‌రావు, పెగడపల్లి

రైతులను ప్రోత్సహిస్తున్నాం



ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాగు చేసిన తోటలను, అక్కడి రైతులు, ఫ్యాక్టరీ నిర్వహణను చూపించాం. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నెలకోసారి కంపెనీతో కలిసి రైతులకు సదస్సులు నిర్వహిస్తున్నాం.

– శ్యాంప్రసాద్, జిల్లా ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

ఏసీబీ వలలో ఇన్‌చార్జి తహసీల్దార్

- భూమి రిజిస్ట్రేషన్ కోసం రూ.15 వేల బేరం
- రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ డీఎస్పీ
- ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ మధ్యవర్తితో లంచం



ఏసీబీకి దొరికిన ఇన్‌చార్జి తహసీల్దార్ గణేశ్, ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ ముజాఫర్

రాయికల్(జగిత్యాల): భూమి రిజిస్ట్రేషన్ కోసం రూ.15 వేల లంచం బేరం కుదుర్చుకుని రూ.10 వేల డబ్బులను రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్ గణేశ్, ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ ముజాఫర్ మధ్యవర్తితో తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డీఎస్పీ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం సింగరావుపేట గ్రామానికి చెందిన గాజర్ల రవి తన 1.025 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కోసం వారం క్రితం ఇన్‌చార్జి తహసీల్దార్ గణేశ్‌ను సంప్రదించగా రూ.15 వేలు లంచం డిమాండ్ చేశాడు. మధ్యవర్తిగా ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ ముజాఫర్ సంప్రదింపులతో బేరం కుదుర్చుకున్నారు. ఈ విషయమై బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా పక్కా ప్రణాళికతో మంగళవారం తహసీల్ కార్యాలయంలో రూ.10 వేలు మధ్యవర్తి ముజాఫర్ ద్వారా ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ గణేశ్, ముజాఫర్‌ను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు తిరుపతి, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.15 వేలు డిమాండ్ చేశారు



మాది రాయికల్ మండలం సింగరావుపేట. 1.025 ఎకరాల భూమిని జగిత్యాలకు చెందిన ఉస్మాన్‌కు అమ్మాను. నా సర్వే నంబరులో ఎక్కువ భూమి ఉందని, రిజిస్ట్రేషన్ చేయడం కుదరదని, డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా మూడు రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించా. రూ.15 వేలకు బేరం కుదుర్చుకుని రూ.10 వేలు ఇస్తుండగా పట్టుకున్నారు.

– గాజర్ల రవి, బాధితుడు

లంచం అడిగితే ఏసీబీని సంప్రదించండి



ప్రభుత్వ శాఖల అధికారులు ఎవరైనా లంచం అడిగితే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబరు 1064 లేదా 94404 46106 నంబర్లను సంప్రదించాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. అవినీతి నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– విజయ్‌కుమార్, ఏసీబీ డీఎస్పీ

తండ్రిని హతమార్చిన తనయుడి అరెస్టు

చందుర్తి(వేములవాడ): తాగొచ్చి కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడన్న నెపంతో తండ్రిని కారుతో ఢీకొట్టి చంపిన తనయుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. చందుర్తి ఠాణాలో మంగళవారం విలేకరుల సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం దేవునితండాకు చెందిన జాటోత్ తిరుపతినాయక్ గత రెండు, మూడేళ్లుగా తాగుడుకు బానిసయ్యాడు. తాగొచ్చి కుటుంబ సభ్యులను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈక్రమంలో తండ్రీకొడుకులు పలుమార్లు గొడవ పడ్డారు. తండ్రీకొడుకులు దాడి చేసుకున్న సంఘటనలో మూడు కేసులు నమోదయ్యాయి. ఇందులో ఓ కేసు ట్రయల్‌లో ఉంది. ఈక్రమంలోనే సోమవారం తల్లి అమీనాపై తండ్రి తిరుపతినాయక్ దాడి చేశాడన్న సమాచారంతో ఆవేశానికి లోనైన కొడుకు రాజేశ్ రోడ్డుపైన నిల్చొని ఉన్న తండ్రిని కారుతో ఢీకొట్టాడు. కిందపడిన తండ్రిపై నుంచి రెండు, మూడు సార్లు కారుతో తొక్కించాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న తిరుపతినాయక్‌ను 108 అంబులెన్స్‌లో వేములవాడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. తండ్రిని హతమార్చిన కుమారుడు రాజేశ్‌ను మండలంలోని లింగంపేట శివారులోని ట్యాంకు వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు.

అరుణాచలం యాత్రకు బస్సు

హుజూరాబాద్: అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రకు హుజూరాబాద్ ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం ఈ నెల 9 నుంచి ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని హుజూరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ మంగళవారం తెలిపారు. ఈనెల 9న మధ్యాహ్నం 2గంటలకు స్థానిక బస్‌స్టేషన్ నుంచి బస్సు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం, మరుసటి రోజు 10న రాత్రి వరకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. 11న అరుణాచల గిరి ప్రదక్షిణ అనంతరం తిరిగి సాయంత్రం 4 గంటలకు అరుణాచలంలో బయలుదేరి 12న హుజూరాబాద్‌కి బస్ చేరుకుంటుందని డీఎం రవీంద్రనాథ్ వివరించారు. సూపర్ లగ్జరీ బస్ చార్జి పెద్దలకు రూ.4,500, పిల్లలకు రూ.3,800 ఉంటుందని, అడ్వాన్స్ బుకింగ్ కోసం 99592 25924, 97048 33971, 92471 59535, 94414 04841 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఆన్లైన్ రిజర్వేషన్ సౌకర్యం కుడా ఉందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రెడిట్ కార్డు అప్‌డేట్ పేరుతో సైబర్ మోసం

జగిత్యాలక్రైం: సైబర్ నేరగాళ్ల వలలో పడి ఓ రైతు తన క్రెడిట్‌కార్డును అప్‌డేట్ చేయగా తన ఖాతా లోని నగదు కాజేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి జగిత్యాల పురాణిపేటలో నివాసం ఉంటాడు. సోమవారం అతడికి బ్యాంక్ అధికారులమని ఫోన్ చేసి క్రెడిట్‌కార్డు కాలపరిమితి ముగిసిందని, ఇంటర్నేషనల్ క్రెడిట్‌కార్డు కోసం అప్‌డేట్ చేయాలని సైబర్ నేరగాళ్లు సూచించారు. దీంతో శ్రీనివాస్‌రెడ్డి నమ్మి తన బ్యాంక్ వివరాలను వెల్లడించి క్రెడిట్‌కార్డు వివరాలు కూడా చెప్పాడు. దీంతో సైబర్ నేరగాళ్లు శ్రీనివాస్‌రెడ్డి ఖాతాలోని రూ.97,195 కాజేయడంతో మోసపోయానని గ్రహించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

నేటి నుంచి పలు రైళ్లు రద్దు



ఎక్స్‌ప్రెస్ రైలు

రామగుండం: కాజీపేట–బల్హార్షా సెక్షన్‌లోని పలు రైల్వేస్టేషన్ల పరిధిలో ఇంటర్ లాకింగ్ సిస్టం పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ డీఆర్‌యూసీసీ మాజీ ప్రతినిధి క్యాతం వెంకటరమణ తెలిపారు.

రద్దయిన రైళ్లు

- ➡ రైలు నంబరు : 67771/67772 : సిర్‌పూర్ – కరీంనగర్ : ఈనెల 20వ తేదీ వరకు
- ➡ రైలు నంబరు : 67773/67774 : కరీంనగర్–బోధన్ : ఈనెల 20 వరకు
- ➡ రైలు నంబరు : 17003/17004 : కాజీపేట–సిర్‌పూర్ కాగజ్‌నగర్–బల్హార్షా : ఈనెల 20 వరకు
- ➡ రైలు నంబరు : 17035/17036 : కాజీపేట–బల్హార్షా : ఈనెల 20 వరకు
- ➡ రైలు నంబరు : 12757/12758 : సికింద్రాబాద్–సిర్‌పూర్ కాగజ్‌నగర్ : ఈనెల 20 వరకు
- ➡ రైలు నంబరు : 12511 : గోరఖ్‌పూర్–రప్తిసాగర్ : ఈనెల 5, 6, 8, 12, 13, 15, 19 తేదీల్లో
- ➡ రైలు నంబరు : 12512 : రప్తిసాగర్–గోరఖ్‌పూర్ : 4, 8, 10, 11, 15, 17, 18 తేదీల్లో రద్దు
- ➡ రైలు నంబరు : 12521 : భరౌణి–ఎర్నాకులం : ఈనెల 9వ తేదీన రద్దు
- ➡ రైలు నంబరు : 12522 : ఎర్నాకులం–భరౌణి : ఈనెల 6, 13వ తేదీల్లో రద్దు
- ➡ రైలు నంబరు : 12591 : గోరఖ్‌పూర్–యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 7, 14వ తేదీలలో రద్దు చేశారు.
- ➡ రైలు నంబరు : 12592 : యశ్వంత్‌పూర్–గోరఖ్‌పూర్ : ఈనెల 9, 16వ తేదీల్లో రద్దు

మంత్రిగా బండికి ఏడాది

- జూన్ 9న ప్రమాణస్వీకారం చేసిన సంజయ్
- సంబరాలకు సిద్ధమవుతున్న కమలనాథులు
- ప్రోగ్రెస్ రిపోర్టు విడుదల చేసిన ఎంపీ ఆఫీస్



సాక్షిప్రతినిధి,కరీంనగర్: కేంద్ర సహాయమంత్రిగా బండి సంజయ్ ఏడాది పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా బీజేపీ నాయకులు సంబరాలకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాదికాలంలో బండి సంజయ్ చేసిన పనులు, చూపిన చొరవను వివరిస్తూ పార్టీ జిల్లా నాయకులు ప్రోగ్రెస్ రిపోర్టు విడుదల చేశారు. 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా బండి సంజయ్ విజయం సాధించారు. జూన్ 9న ప్రధాని నరేంద్రమోదీ కేబినెట్‌లో కేంద్ర సహాయమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. మంత్రిగా ఏడాది పూర్తికానుండడంతో అభిమానులు, పార్టీ నాయకులు సంబరాలకు సిద్ధమవుతున్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి

జాతీయ ఉపాధిహామీ పథకం కింద ప్రతీ మండలానికి రూ.2కోట్లు ఖర్చు చేసి ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో రోడ్లు నిర్మించారు. సగటున ఒక్కో గ్రామానికి రూ.5లక్షలు అంతర్గత రోడ్లకు వెచ్చించారు. ఆధునీకరణ పనుల్లో భాగంగా కరీంనగర్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.33కోట్లకుపైగా ఖర్చు చేశారు. పెండింగ్‌లో ఉన్న కరీంనగర్–జగిత్యాల జాతీయ రహదారి విస్తరణ పనులకు రూ.2వేల కోట్లతో మరో రెండు వారాల్లో టెండర్ ప్రక్రియను ప్రారంభించనున్నారు.

రైల్వేపై ప్రత్యేక శ్రద్ధ

ఇటీవల కరీంనగర్ రైల్వేస్టేషన్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించిన విషయం తెలిసిందే. వీటితోపాటు కరీంనగర్, జమ్మికుంట ఆర్వోబీ నిర్మాణంలో జాప్యమవుతున్న విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారులతో సమావేశమై వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆగస్టు నాటికి జమ్మికుంట ఆర్వోబీ పనులు పూర్తికాకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన విషయం తెలిసిందే. కరీంనగర్–తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణంలో ఇబ్బందులను అధిగమించేందుకు రైల్వేశాఖ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి.. పనుల వేగవంతం చేయించడంలో సఫలీకృతులయ్యారు. వారానికోసారి నడిచే కరీంనగర్–తిరుపతి రైలును వారానికి రెండుసార్లు నడిచేలా కృషి చేశారు. అదే రైలును ఇకపై వారానికి 4 సార్లు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈమేరకు రైల్వేశాఖ ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

మరిన్ని పనులివే..

- ➡ సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో సైనిక్ స్కూళ్ల ఏర్పాటుకు బండి సంజయ్ వినతికి కేంద్రం సానుకూలత వ్యక్తం చేసింది.
- ➡ సిరిసిల్ల, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో నవోదయ స్కూళ్ల మంజూరులో చొరవచూపారు.
- ➡ వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను టూరిజం సర్క్యూట్‌గా మార్చాలన్న ప్రతిపాదలపై త్వరలోనే కేంద్రం ప్రకటన చేయనుంది.
- ➡ శాతవాహన వర్సిటీ పరిధిలో లా కళాశాల మంజూరుకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్‌ను కలిసి మంజూరు చేయించారు.
- ➡ అంబేద్కర్ స్టేడియంలో సింథటిక్ పార్క్, స్పోర్ట్స్ రిక్రియేషన్ సౌకర్యాలు కల్పించాలన్న ప్రతిపాదనకు కేంద్ర క్రీడాశాఖ సుముఖత వ్యక్తం చేసింది. పెండింగ్‌లో ఉంటున్న కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు బండి సంజయ్ కృషి మరువలేనిది.
- ➡ కరీంనగర్ పార్లమెంటు పరిధిలో రూ.5కోట్ల సీఎస్సార్ నిధులను రాబట్టారు. వాటితో వేములవాడ, హుస్నాబాద్, హుజూరాబాద్, జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రులకు అత్యాధునిక వైద్య పరికరాలను అందించారు.
- ➡ ఈ ఏడాది 10వ తరగతి చదివే 6 వేల మంది బాలికలకు ప్రత్యేకంగా సైకిళ్లను అందించేందుకు ఆర్డర్ ఇచ్చారు. వీటిని త్వరలోనే విద్యార్థులకు అందజేయనున్నట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది.
- ➡ ఈ ఏడాది మార్చిలో థాయిలాండ్ లో సైబర్ కేఫ్ లో చిక్కుకున్న 540 మంది భారతీయులను సాక్షి కథనాలతో స్పందించిన బండి సంజయ్ ప్రత్యేక చొరవ తీసుకుని కాపాడారు. రెండు ప్రత్యేక విమానాల్లో వారిని ఇండియాకు తరలించారు.

ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

జగిత్యాలక్రైం: రోడ్డు ప్రమాదం కేసును మల్యాల సీఐ నీరుగార్చుతున్నారని, వాహనదారునికి వత్తాసు పలుకుతున్నాడని మృతుడి కుటుంబ సభ్యులు మంగళవారం జగిత్యాల ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాలు.. మల్యాల మండలం రాంపూర్ గ్రామానికి చెందిన అల్లెపు నరేశ్ ఏప్రిల్ 28న రాజారం వద్ద లారీ ఢీకొని మృతిచెందాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి లారీని స్టేషన్‌కు తరలించారు.లారీకి ఇన్సూరెన్స్ ఉందని, పరిహారం వస్తుందని మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. దీంతో చివరికి లారీని వదిలిపెట్టి ప్రస్తుతం లారీకి ఇన్సూరెన్స్ లేదని మల్యాల సీఐ కేసును నీరుగార్చుతున్నారని, తమను నిత్యం పోలీస్‌స్టేషన్‌కు రమ్మని రోజుకో కారణం చెబుతూ అన్యాయం చేస్తున్నాడని ఆరోపించారు. దీంతో నరేశ్ తండ్రి అల్లెపు బాలయ్య, తల్లి శారదతో పాటు పలువురు బంధువులు ఎస్పీ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు.

కాలగర్భంలో రామగుండం బీ–థర్మల్

- విద్యుత్ కేంద్రం మూతపడి నేటితో ఏడాది



రామగుండం థర్మల్ పవర్ స్టేషన్

రామగుండం: పట్టణంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యంగల రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ (ఆర్‌టీఎస్–బీ) కాలగర్భంలో కలిసి పోయి బుధవరాం నాటికి ఏడాది పూర్తవుతోంది. ఉమ్మడి రాష్ట్రంలోనే తొలివిద్యుత్ కేంద్రంగా పేరు గాంచిన ఆర్‌టీపీఎస్.. సుమారు ఆరు దశాబ్దాలపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెలుగులు పంచింది. ఈక్రమంలోనే విద్యుత్ ఉత్పత్తి, పీఎల్‌ఎఫ్‌లో అనేక సరికొత్త రికార్డులు నెలకొల్పింది. స్థానికంగా బొగ్గు, నీరు, రవాణా వ్యవస్థకు అనువైన పరిస్థితులు ఉండడంతో రామగుండం ప్రాంతం విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు నిలయంగా మారింది. దీంతో దేశంలోనే ఆధునిక విద్యుత్ కేంద్రాలతో పోటీ పడుతూ, అతి తక్కువ ధరకే విద్యుత్ ఉత్పత్తి చేసిన ఘనత బి–థర్మల్ కేంద్రానికే దక్కింది. రూ.14.8 కోట్ల వ్యయంతో 1965 జూలై 19న విద్యుత్ కేంద్రం స్థాపనకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత డిసెంబర్ 10, 2007 నుంచి నిరాటకంగా 159 రోజులపాటు విద్యుత్ ఉత్పత్తి చేసి రికార్డు సాధించింది. దానిని తిరగరాస్తూ 20 ఫిబ్రవరి 2017 తర్వాత ఒకరోజు ఎక్కువగా 160 రోజులు సాధించి రికార్డులు బద్దలు కొట్టింది. 159 రోజుల్లో 92.64 పీఎల్‌ఎఫ్‌తో 221.74 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత సైతం ఆధునిక విద్యుత్ కేంద్రాలతో పోటీపడుతూ ఉత్పత్తి, పీఎల్‌ఎఫ్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించింది.



పోటెత్తిన భక్తులు



మల్యాల(చొప్పదండి): కొండగట్టు అంజన్న సన్నిధికి మంగళవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. కోనేరులో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీకాంత్‌రావు, అశోక్, సుధాకర్‌రెడ్డి, రవి, రాములు చర్యలు చేపట్టారు. వేలాదిమంది తరలిరావడంతో కోనేటి నీరు మురికిగా మారగా, భక్తులు షవర్ల వద్ద స్నానమాచరించారు. ప్రతీ శని, మంగళవారాలు కోనేటిలోకి నీరు నిరంతరాయంగా విడుదల చేయాలని భక్తులు కోరుతున్నారు.